క్లుప్తంగా

మంత్రి బొత్సను కలిసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి


మంత్రి బొత్సతో ఎమ్మెల్యే మద్దిశెట్టి, నాయకులు

దర్శి: విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను దర్శి శాసనసభ్యుడు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ విజయవాడలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. దర్శిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎంపీపీ గోళ్లపాటి సుధా అచ్చయ్య, తిరుపతి రెడ్డి, విజయ్, బుజ్జి, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, రాము ఉన్నారు.

కౌలుకార్డుల ప్రయోజనాలు గుర్తించాలి

గిద్దలూరు రూరల్: రైతులు కౌలుకార్డుల ప్రయోజనాలను గుర్తించాలని వ్యవసాయ శాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముండ్లపాడు రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఆధార్‌కార్డు, భూయజమాని పొలం పాస్‌పుస్తకం, భూ యజమాని అంగీకార పత్రాలు సమర్పించి కౌలు కార్డులు తీసుకోవాలని చెప్పారు. కౌలుకార్డు తీసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దొంగతనాలు అరికట్టేందుకు సహకరించాలి

గిద్దలూరు రూరల్: దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని స్థానిక సీఐ దేవ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరప్రాంతాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దీనివల్ల ఆ ఇంటిపై ప్రత్యేక నిఘా పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో విలువైన బంగారు ఆభరణాలు, పెద్ద మొత్తం నగదు సమీప బంధువుల వద్ద లేదా బ్యాంకుల్లో భద్రపరచాలని ఆయన కోరారు. ప్రజలు పోలీసులకు సహకరించి దొంగతనాలు అరికట్టేందుకు తోడ్పడాలన్నారు.

గ్రామ వ్యవసాయ సహాయకులతో రివ్యూ

దర్శి: మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులతో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ నాయక్ బుధవారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా డబ్బులు ఎన్‌పీసీఐ ఇన్ ఆక్టివ్ కారణంగా కొంతమందికి జమ కాలేదన్నారు. ఈ డబ్బులు జమకాని రైతుల జాబితా ప్రతి రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉందన్నారు. సంబంధిత రైతులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. వారి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐని యాక్టివ్ చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులకు కౌలు కార్డులు జారీ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సన్మాన యోజన కింద కొందరు రైతులు ఈకేవైసీ చేయించుకోలేదని, దీని ద్వారా పీఎం కిసాన్ డబ్బులు జమ కావని తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని రైతులతో ఈకేవైసీ చేయించాలన్నారు.

రీసర్వేకు రైతులు అందుబాటులో ఉండాలి

తూర్పుగంగవరం (తాళ్లూరు): రీ సర్వేలో వచ్చిన ల్యాండ్ ప్లాన్ మెజర్‌మెంట్‌ను కచ్చితంగా గుర్తించి రెవెన్యూ అధికారులకు తగిన విధంగా సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్ సూచించారు. తూర్పుగంగవరం సచివాలయంలో బుధవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తన చోట డ్రోన్ సర్వే ద్వారా వచ్చిన ఓఆర్ఎల్ షీట్స్ తీసుకుని వీఆర్‌ఓలు రైతుల పొలాలకు వస్తారని చెప్పారు. 2022 నవంబర్ 1 ముందు ఉన్న సాధారణ అగ్రిమెంట్స్ పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్‌కు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచి నాగమణి, వీఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటుకు రూ.1.50 కోట్లు

● పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


సురేష్ వారధిని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పక్కన వైఎస్సార్ సీపీ నేతలు

యర్రగొండపాలెం: పట్టణంలో అహ్లాదకర వాతావరణంలో గడిపే విధంగా పార్కు ఏర్పాటు చేసేందుకు రూ.1.50 కోట్లు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. బుధవారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులోని రాళ్ల వాగుపై నిర్మించిన సురేష్ వారధి (వంతెన)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాళ్లవాగు వెంట ఉన్న ప్రభుత్వ భూమిలో పార్కు నిర్మిస్తే త్వరలో పూర్తయ్యే టీటీడీ కల్యాణ మండపం, రైతు బజార్‌లకు వచ్చే వారికి ఎంతగానో ఉపయోగ పడుతుందని, వాకర్స్‌తో పాటు తమ పిల్లలతో వచ్చిన వారికి ఈ పార్కు ఉపసమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. సురేష్ వారధితో ఎక్కువగా ఉపయోగం ఉన్న ప్రైవేటు లేఔట్లు వేసిన యజమానులు తమ లేఔట్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మించుకునేందుకు 5 సెంట్ల భూమిని కేటాయిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, సురేష్ వారధి నిర్మాణ దాతలు ఎం.కరీముల్లాబేగ్, కొత్తమాసు సురేష్ పాల్గొన్నారు.

ఆధార్‌ను బ్యాంక్ అకౌంట్‌కు లింక్ చేసుకోవాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఓ

దొనకొండ: గ్రామాల్లోని రైతులు ఆధార్‌ను బ్యాంక్ అకౌంట్‌కు లింక్ చేసుకోవాలని, లేకుంటే రైతు భరోసా పథకం లబ్ధి పొందరని మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండలంలోని వద్దిపాడు, ఆరవల్లిపాడు గ్రామాల్లో ఆయన రైతులకు బుధవారం సూచనలు, సలహాలిచ్చారు. మండలంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 5వ సంవత్సరం మొదటి విడతలో 6938 మంది రైతు కుటుంబాలకు రూ.5.20 కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఆధార్ నంబర్ బ్యాంక్ అకౌంట్‌కు జత చేసుకోవటం, ఆధార్ నంబర్ వేలిముద్రలు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. శుక్రవారంలోపు జత చేయించుకోవాలని, శనివారం ప్రభుత్వం డబ్బు జమ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని గ్రామ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు. వ్యవసాయ సిబ్బంది ధనరాజు, రమేష్‌బాబు, విన్నీబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సహకరిస్తా..


వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ

కొనకనమిట్ల: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా, మండల అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి, నుసుం బాలచంద్రుడు ఆధ్వర్యంలో మార్కాపురం నియోజకవర్గంలో 10 త్రిచక్ర(మోటరైజ్‌డ్) వాహనాలను పలువురు దివ్యాంగులకు అందజేశారు. బుధవారం వాగుమడుగు గ్రామానికి చెందిన వసంతపురం చెన్నబాబుకు త్రిచక్ర వాహనాన్ని అందించారు. ఎమ్మెల్యే కేపీ వాహనాన్ని నడిపి చెన్నబాబును ఉత్సాహపరిచారు.

మాదిగల హక్కుల సాధనకు పోరాటం


మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

కంభం: మాదిగల హక్కులు సాధించుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య అన్నారు. బుధవారం కంభం వచ్చిన ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని కందులాపురం కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పక్కన బాబూజగ్జీవన్‌రావ్ విగ్రహం ఏర్పాటు చేస్తుంటే అధికారులను అడ్డం పెట్టుకొని విగ్రహం ఏర్పాటు చేయకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ విగ్రహం పక్కన జగ్జీవన్‌రావ్ విగ్రహం ఏర్పాటు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడాన్ని ఆయన ఖండించారు. జూలై 7న విజయవాడలో జరగనున్న మాదిగల జన జాగృతి సభను విజయవంతం చేయాలని బ్రహ్మయ్య మాదిగ కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పానుగంటి షాలెంరాజు, జయరాజ్, బొడిచెర్ల రాజు పాల్గొన్నారు.

పాల ట్యాంకర్ బోల్తా


బోల్తా పడిన ట్యాంకర్

బేస్తవారిపేట: మండలంలోని చెట్టిచెర్ల బస్టాండ్ సమీపంలో హైవేపై పాల ట్యాంకర్ బోల్తా పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. నంద్యాల నుంచి రాజమండ్రికి 18 వేల లీటర్ల పాలతో వెళ్తుండగా ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులో చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో డ్రైవర్ జాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు బిందెలతో పాలు పట్టుకొని తీసుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అంగన్‌వాడీల పనితీరు మారాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న సీడీపీఓ భారతి

కురిచేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పనితీరు మారాల్సి ఉందని దర్శి సీడీపీఓ సీహెచ్ భారతి అన్నారు. స్థానికంగా నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యకర్తలందరూ ఖాళీ గోతాలు అప్పగించేందుకు తర్లుపాడు వెళ్లారని, ఆ సమయంలో ఆయాలు ఎలా విధులు నిర్వర్తిస్తున్నారో తనిఖీ చేసేందుకు వచ్చానన్నారు. రికార్డులు సక్రమంగా లేవని, వంటలు చేయడంలో కూడా లోపాలున్నాయన్నారు. ఈ విధానం మారాలని, ఎవరి పని వారు బాధ్యతగా చేసేలా చూస్తానన్నారు. చిక్కీలు బాగా లేకపోయినా, గుడ్లు సక్రమంగా లేకపోయినా, వంటలు మెనూ ప్రకారం లేకపోయినా వెంటనే తనకు ఫిర్యాదు చేయాలని కేంద్రానికి వచ్చిన వారికి సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ సుభాషిణి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి

ముండ్లమూరు: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసుకోవాలని ఈదర సర్పంచ్ వంగల పద్మావతి అన్నారు. మండలంలోని ఈదర, మారెళ్ల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రజల భాగస్వామ్యం కార్యక్రమంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా అన్ని వసతులు కల్పిస్తున్నందున గర్భిణులు, చిన్నారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లక్ష్మి, నిర్మల, కళావతి, మాధవి పాల్గొన్నారు.

తాళ్లూరు: చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, సునీత కోరారు. మండలంలోని మాధవరం, రజానగరం గ్రామాల్లో బుధవారం జన భాగస్వామ్యం కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలలకు పంపించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

కురిచేడు: మండలంలోని ఎస్‌ఎస్‌పీ అగ్రహారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాల చైర్మన్ ఎం.చిరంజీవి బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగు, యూనిఫాం, బూట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలలో 50 మంది రక్తదానం

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: స్థానిక జిల్లా వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. వైద్యశాలలో పనిచేస్తున్న 50 మంది సిబ్బంది, డాక్టర్‌లు, స్టాఫ్ నర్సులు స్వయంగా రక్తదానం చేశారు. ఈనెల 11న సాక్షిలో 'సంజీవినికి సంకటం' శీర్షికన రక్తం నిల్వల కొరతపై వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన సూపరింటెండెంట్ సిబ్బందితో మాట్లాడి రక్తదానం శిబిరం నిర్వహించారు. కాగా బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా 20 పర్యాయాలకు పైగా రక్తదానం చేసిన డాక్టర్ పగడాల లక్ష్మీరెడ్డి, షేక్ అబ్దుల్ రజాక్, ఎం.శ్రీనివాసరెడ్డి, వై.నరేష్ కుమార్, కందూరి రవికుమార్, ఉద్దడం వీరశంకరయ్యను ఘనంగా సన్మానించారు. డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో దాడి

పుల్లలచెరువు: తీసుకున్న అప్పు ఇవ్వలేదని అడిగిన పాపానికి కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని మల్లాపాలెంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లాపాలెం గ్రామానికి చెందిన కందుల పోలయ్య అదే గ్రామానికి చెందిన ముటుకూరి ముసలయ్యకు అప్పు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని ముసలయ్యను అడగంతో ముసలయ్య కత్తితో పోలయ్య గొంతుపై దాడి చేయడంతో గాయాలయ్యాయి.

కంభం తహసీల్దార్‌గా శైలేంద్రకుమార్

కంభం: మండల తహసీల్దార్‌గా పులి శైలేంద్రకుమార్ బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రవి బదిలీపై వెళ్లిన నేపథ్యంలో పొన్నలూరు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శైలేంద్రకుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం విధుల్లో చేరగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పూలమాల, శాలువాతో సన్మానించారు. రీ సర్వే డీటీ స్వాతి, ఆర్‌ఐ శ్రీను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

దొనకొండ: మండలంలోని చిన్నగుడిపాడు, దొండపాడు గ్రామాల్లో నిర్మిస్తున్న తరగతి గదులను మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు బుధవారం పరిశీలించారు. త్వరగా నిర్మించాలని, నాణ్యత లోపం లేకుండా ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ఈ నెలలోపు ప్రతి అదనపు తరగతి గదిని పూర్తిగా నిర్మించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని ఎస్.సాంబశివరావు సూచించారు. చిన్నగుడిపాడు గ్రామంలో వేస్తున్న శ్లాబును ఆయన పరిశీలించారు.

మార్కండేశ్వరస్వామికి 5 కిలోల వెండి సర్వాభరణం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణానికి చెందిన దాతలు మద్దెల లక్ష్మి, సతీష్ దంపతులు బుధవారం శ్రీజగదాంబ సమేత మార్కండేశ్వర స్వామివారికి 5.360 కిలోల వెండి సర్వాభరణాన్ని చైర్మన్ వాలిచెర్ల కేశవరావు, ఈవో చెన్నకేశవరెడ్డికి అందజేశారు. సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి


శంకుస్థాపన చేస్తున్న బాలమురళీకృష్ణ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డులో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు, 9వ బ్లాకులో నురాని మసీదు రోడ్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అన్ని ప్రాంతాల్లో దశల వారీగా సీసీ రోడ్లను నిర్మిస్తున్నామని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. ప్రజలు కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్ సిరాజ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఖుర్షీద్ అహ్మద్, నాయకులు మున్వర్, ఇస్మాయిల్, రషీద్, డేగా శ్రీను, హనీష్, హబీబ్‌బాషా పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం: ఏపీఈఏపీసెట్‌లో మార్కాపురం విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. పట్టణంలోని జ్ఞానశ్రీ నీట్, ఐఐటీ అకాడమీకి చెందిన జి.మోహన్‌పూర్ణ 1026వ ర్యాంక్, టి.నందినికి 4,212 ర్యాంక్ వచ్చినట్లు డైరెక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. సాధన జూనియర్ కాలేజికి చెందిన త్రిపుర తేజశ్రీకి 5,382వ ర్యాంక్, ప్రియవర్షితకు 8,606 ర్యాంక్ వచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సచివాలయాలతో మెరుగైన పాలన


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

● ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

కంభం: సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మెరుగైన పాలన అందిస్తోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. నూతనంగా నిర్మించిన కంభం–1 సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయని, ఏ సమస్యనైనా వారి గ్రామంలోనే పరిష్కరించుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు. గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు పూర్తవుతుండటంతో సేవలు మరింత సులభతరవుతాయని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే సచివాలయాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. సిబ్బంది ఎల్లప్పుడూ సచివాలయాల్లో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, కొమరోలు జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు, బేస్తవారిపేట జెడ్పీటీసీ వెంకటరాజు, పంచాయతీరాజ్ డీఈ ప్రసాద్, ఏఈ అంజనేయరెడ్డి, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, ఈఓఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి బ్రహ్మయ్య, సర్పంచ్‌లు మహబూబ్‌పీరా, రసూల్, ఉప సర్పంచ్ ఖాసిం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, కొత్తపల్లి శ్రీను, రఫీ, ఇమ్మడి నాగరాజు, డిష్ మున్నా, గంగారపు ఓబయ్య, సబ్బసాని సాంబశివారెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే అన్నా

అర్ధవీడు (కంభం): మంటల్లో ఇళ్లు కాలిపోయి నిరాశ్రయులుగా మిగిలిన అర్ధవీడు చెంచుకాలనీ వాసులకు తక్షణ సాయం అందిస్తామని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. బుధవారం ఆయన అగ్ని ప్రమాదం జరిగిన చెంచు కాలనీని సందర్శించి బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణ సాయం కింద నిరాశ్రయులుగా ఉన్న వారికి వంట సామగ్రి, దుప్పట్లు, చీరలు, చాపలు, బిందెలు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన తక్షణ సాయం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే అన్నా ఆదేశించారు.

నేడు జగనన్న 'ఆణిముత్యం' ప్రారంభం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు జగనన్న ఆణిముత్యాలు అనే కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రారంభించనున్నట్లు ఎంఈఓ నరసంహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యర్రగొండపాలెం: స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని సందేశం ఇస్తారని పేర్కొన్నారు.

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తూ ఉత్తమ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినులు జగనన్న ఆణిముత్యాలు పురస్కారానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు తెలిపారు. 2021–23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించిన బి.సుష్మిత సీఈసీలో 937/1000, జి.సుమలత హెచ్‌ఈసీలో 890/1000 మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలు స్టేట్ బ్రిలియంట్స్ అవార్డుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. గిద్దలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేయనున్న సమావేశంలో ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు చేతుల మీదుగా నగదు పురస్కారాలు ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు తెలిపారు.

రక్తదానంపై అపోహలు వీడాలి


మాట్లాడుతున్న వెన్నా హనుమారెడ్డి


రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న హరినాథరెడ్డి

మార్కాపురం టౌన్: రక్తదానం చేయడం గొప్ప విషయమని ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యులు, వీహెచ్‌ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి అన్నారు. బుధవారం రక్తదాతల దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కళాశాల విద్యార్థులతో బ్లడ్ డొనేషన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు. స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత రక్తదానంపై అపోహలు వీడి ముందుకు రావాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏవో ప్రభాకర్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: రక్తదానంపై అపోహలు వదిలేయాలని డీజీఆర్ వైద్యశాల అధినేత డాక్టర్ హరినాథరెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదానం దినోత్సవం సందర్భంగా మేమున్నాం సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని రేడియోబావి సమీపం అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంతో జరిగే మేలు వివరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు వైద్యులు రక్తదానం చేశారు. మేమున్నాం సేవా సమితి అధ్యక్షుడు చల్లా అశోక్‌రెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి


ప్రజావేదికలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనులతో ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన ప్రజావేదికకు ఆయన ముఖ్య అతథిగా హాజరై మాట్లాడారు. సామాజిక తనిఖీతో పనుల్లో నాణ్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పనులు గుర్తించడంలో విఫలమయ్యామని, ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించి చేపట్టి నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. గతేడాది ఉపాధి పనులకు సంబంధించి అన్ని పేమెంట్లు పూర్తిగా చెల్లించామని డ్వామా పీడీ శీనారెడ్డి తెలిపారు. ఇంకా నిధులు ఉన్నాయని, పనులు గుర్తించి చేపట్టవచ్చన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఉద్యానవన పంటలు పండించుకునేందుకు ఉపాధి హామీ పథకం సిద్ధంగా ఉందన్నారు. రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 500 రకాల పనులు ఉన్నాయని, గ్రామాల అభివృద్ధి కోసం పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపితే మంజూరు చేస్తామన్నారు. మండలంలో సైడు కాలువలు, రోడ్లు అవసరముందని బెల్లం చంద్రశేఖర్ కోరారు. డీసీసీ వెంకటస్వామి, ఎంపీడీఓ వసంతరావు నాయక్, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, ఏపీఓ నాగప్రసాద్, ఆవుల వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠలు


ముస్తాబైన సీతారాముల విగ్రహాలు


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు హాజరైన భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు దక్షిణంపల్లి గ్రామంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నూతన రామాలయం, ఉపాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య నూతన ధ్వజ స్తంభాన్ని, ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆగమ పండితుడు ఓరుగంటి సీతారామశర్మ, శిష్య బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి శిఖర కలశ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

దొనకొండ: మండలంలోని చిన్నగుడిపాడులో గ్రామస్తులు ఐక్యంగా బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరుపుకున్నారు. గతేడాది నూతన గుడిని ఏర్పాటు చేసి శిలలు ప్రతిష్ఠించి కల్యాణం చేశారు. ఈ ఏడాది 2వ సంవత్సరం గ్రామస్తులు కల్యాణం జరిపారు. పిల్లలు, పెద్దలు తలంటి స్నానాలు చేసి వారి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం చల్లగా ఉండాలని, పాడి పంటలు సంమృద్ధిగా పండాలని, పిల్లా పాపలు సుఖ సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. పూజారులు రెంట చింతల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం చేశారు. మాచిరెడ్డి వారు అన్నదానం చేశారు.

అంకమ్మ తల్లి గుడి నిర్మాణానికి శ్రీకారం

తాళ్లూరు: తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో బెల్లంకొండవారిపాలెంలో నిర్మించనున్న అంకమ్మ తల్లి గుడి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. తాళ్లూరు మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి దంపతులు, ఎస్టీ కాలనీ పెద్దలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గుడి నిర్మాణానికి సహకరించి రూ.10 లక్షలు మంజూరు చేయించిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.